


# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## శ్రీనాగరాజు స్వామి కళ్యాణం కమనీయం



**వింజమూరు, జూన్ 27, ప్రభాతవార్త** వింజమూరు మండలం చాకలకొండ పంచాయతీ పరిధిలోని గోళ్ళ వారిపల్లి గ్రామంలో చుంచువారి ఇలవేల్పు అయినటువంటి శ్రీ నాగరాజు సహిత నాగదేవి కళ్యాణ వేదికలను చుంచు వంశస్థులు ఘనంగా నిర్వహించారు. గురువారం గోళ్ళవారిపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరై శ్రీనాగరాజు సహిత నాగదేవతకు ముత్యాల తలంబ్రాలను అందించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా స్వామివారి కళ్యాణ ఘటంను ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను బాణసంచా మోతల మధ్య మంగళవాయిద్యాలతో పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ రానున్న రోజుల్లో నియోజకవర్గ అభివృద్ధి ఉదయగిరి నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతానన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కూనల వెంకటేశ్వర్లు, చల్లా వెంకటేశ్వర్లు, దాట్ల రమేష్‌రెడ్డి, గోళ్ళ వారిపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు చుంచు వంశస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి అనిల్ పై తప్పుడు కేసులు పెట్టొద్దు



**నెల్లూరు రూరల్, జూన్ 27, ప్రభాతవార్త** ఇటీవల నెల్లూరు నగరంలోని వెంకటేశ్వర సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వైఎస్ఆర్సిపి జిల్లా కార్యాలయ వివాదం అందరికీ తెలిసిందే. ఈ వివాదంపై వైసిపి ముస్లిం నాయకులు మాగుంట లేఔట్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కావాలనే మాజీ మంత్రి అనిల్ కుమార్ పై బురదజలే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. ముస్లిం మహిళలు రెచ్చగొట్టి టిడిపి నాయకులు అనిల్ కుమార్ యాదవ్ పై కేసులు పెట్టిస్తున్నారని తెలిపారు. ఆ స్థలానికి సంబంధించి రావాల్సిన అమౌంట్ ప్రభుత్వం ఎప్పుడో చెల్లించిందని, కావాలనే ఆస్తుల వివాదాన్ని టిడిపి నాయకులు చిత్రకి ఇస్తున్నారని అన్నారు. వైసిపి రాష్ట్ర ముస్లిం మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ హంజా హుస్సేనీ, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు షైక్ సిద్ధిక్, కో ఆప్షన్ సభ్యులు సమీర్, నాయకులు మస్తాన్, జియాబుల్ హక్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిలిప్ గ్రీన్‌ను కలిసిన ఎంపి వేమిరెడ్డి



నెల్లూరు, జూన్ 27, ప్రభాతవార్త – వైద్యం తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆస్ట్రేలియా హై కమిషనర్ ఫిలిప్ గ్రీన్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం సాయంత్రం పలువురు లోక్ సభ ఎంపిలతో డిల్లీలోని ఆస్ట్రేలియన్ హై కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆస్ట్రేలియా హై కమిషనర్ ఫిలిప్ గ్రీన్‌కి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఆయనతో విపిఆర్ భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు.

## ఉపాధ్యాయుడు ఇంట్లో చోరీ

### 8 లక్షలు బంగారు,3 లక్షల నగదు అపహరణ


### క్లూస్ టీం పరిశీలన





**బుచ్చి జూన్ 27 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని స్దానిక లైలాఫంక్షన్ హాల్ సమీపంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న వెంగళరావు ఇంట్లో ఈ చోరి జరిగినట్లు పోలీసులు తెలిపారు. వెంగళరావు కుటుంబసమేతంగాబుధవారం ఉదయం నర్రవాడ అమ్మవారి ఉత్స వాలకు వెళ్లారు. ఇంటికి వచ్చి చూసే సరికి తలుపులు పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. లోపలకి వెళ్ళి చూడగా తలుపులతోపాటు బీరువాలు ద్వంసం చేసి వున్నాయి.వస్తువులన్ని చిందరవం దరగా పడి ఉన్నాయి. 100కి సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్దలానికి క్లూస్ టీంను పంపించారు. వారు సంఘటనా స్దలాన్ని పరిశీలించి వేలిముద్రలను స్వీకరించారు. క్రైమ్ అడిషనల్ ఎస్‌పి ప్రసాద్,క్రైమ్ ఇనస్పెక్టర్ కోటేశ్వరరావు సంఘటనా స్దలాన్నిచేరుకొని బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులు వెంగళరావు మాట్లాడుతు 8 లక్షలు బంగారు,3లక్షల రూపాయాలు నగదు దోచుకు వెళ్ళినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ హైమరావు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## ఆరునెలల్లో మున్సిపాలిటీకి ఎన్నికలు - ఎమ్మెల్యే



**వలేటివారిపాలెం/కందుకూరు జూన్ 27, ప్రభాతవార్త** కందుకూరు మున్సిపాలిటీకి 6 నెలల్లో ఎన్నికలు జరిపించెందుకు కృషిచేస్తానని స్దానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై సమీ క్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కందుకూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడిం చారు. ఇందుకు అధి కారులు ప్రజలు సహకరించాలని కోరారు .ఇందుకోసం మున్సిపల్ శాఖామంత్రిగారి సహకారంతో ఆరునెలల్లో ఎన్నికలు జ రిపిం చి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని అన్నారు.అభివృద్ధిపనుల విషయమై ప్రతిపాదనలు త యారుచేయాలని కమీషనర్ కృష్ణారెడ్డికి సూచించారు.కొత్త లేఅవుట్ల విషయంలో నిబంధనలు పాటిం చాలని ప్రతి లేఅవుట్ 30అడుగుల వెడల్పు రోడ్డు,చక్కటి డ్రైనేజి వసతి ఉండేవిధంగా ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటా యన్నారు.పారిశుధ్యచర్యలు చేపట్టాలని ఆక్రమణలు తొలగించాలని,శ్మశానాల్లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులుకు సూచించారు. అభివృద్ధిపనులవిషయమై మున్సిపల్ శాఖామంత్రితో చరవాణిలో మాటా్లడారు. ప్రతిపాదనలు తయారుచేసి పంపిస్తే ప్రాధాన్యత క్రమంలో నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం.తదుపరి మార్కెట్ సెంటర్‌లో జరుగుతున్న అన్నా క్యాంటీన్ పనులును పరిశీలించారు.త్వరలో క్యాంటీన్ ప్రారంభించనున్నట్ల వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కమీషనర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## నెల్లూరు జైలుకు పిన్నెల్లి



**నెల్లూరు క్రైం, జూన్ 27, ప్రభాతవార్త** హైకోర్టుతో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నరసరావు పేటలో పోలీసులు అరెస్టు చేశారు. నేరుగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఎస్పి కార్యాలయానికి తరలించగా అక్కడి నుంచి వైద్య పరీక్షలు కోసం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. నరసరావు పేట నుంచి మాచర్లకు తరలించిన పోలీసులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని న్యాయమూర్తి ముందు ప్రవేశ పెట్టారు. న్యాయమూర్తి రెండు కేసుల్లో రామకృష్ణారెడ్డికి 14 రోజులు రిమాండ్ విధించగా నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారానికి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పోలీసులు తరలించారు.

# జిల్లా శాఖల అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష



**నెల్లూరు అర్బన్, జూన్ 27, ప్రభాతవార్త** ప్రజలకు సుపరిపాలన అందించడమే ధ్యేయంగా అధికారులు పని చేయాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పి. నారాయణ సూచిం చా రు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణ న్‌తో కలిసి హౌసింగ్, రెవెన్యూ, ఎక్సైజ్, మైన్స్, విద్యుత్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ ప్రజలను ఇబ్బంది పెట్టకుండా అందరికి సుపరిపాలన అందించడమే లక్ష్యంగా జిల్లాలోని ప్రతి ఒక్క అధికారి పనిచేయాలని కోరారు. జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన హౌసింగ్ పురోగతి గురించి తెలుసుకున్న మంత్రి వివిధ లే అవుట్‌లలో మౌలిక వసతులు కల్పిస్తేనే ప్రజలు ముందుకు వచ్చి ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయుటకు ఏమేమి చర్యలు చేపట్టాలో పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఎక్సైజ్ శాఖ సమీక్ష సందర్భంగా ప్రస్తుతం అమల్లో ఉన్న బార్ లైసెన్సింగ్ విధానం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా త్వరలోనే మైనింగ్‌శాఖ పై పూర్తి స్థాయిలో దృష్టి సారి స్తామన్నారు. అదే విధంగా నూతన నిర్మాణ అనుమ తులన్నీ ఆన్ లైన్‌లో ఇచ్చే విధంగా గతంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అమలు చేశామ న్నారు. నుడా పరిధిలో నూతన లే అవుట్లు వేసే వ్యాపారులు ఖచ్చితంగా నిబంధనలు పాటించి ముందస్తు అనుమతులు పొందాలన్నారు. ఎటువంటి పరిస్థితుల్లో ఎవ్వరినీ ఇబ్బంది పెట్టే విధంగా తమ చర్యలు ఉండవన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జూయింట్ కలెక్టర్ సేదు మాధవన్, నెల్లూరు మున్సిపాలిటీ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, డిఆర్ఓ లవన్న, ఆర్‌డిఓ మాలోల, హౌసింగ్ పిడి నాగరాజు, విద్యుత్ ఎస్ఇ విజయన్, ఎక్సైజ్, మైన్స్ అధికారులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ కాలువలు ఇలా.. నీరు పారేది ఎలా ?





**కోవూరు, జూన్ 27 ప్రభాతవార్త :** ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలోని పలు ఇరిగేషన్ కాలువలు గుర్రపుడెక్కలతో పాటు కాలువలు పూర్తిగా ఆక్రమణలకు గురై చెత్తా చెదారాలతో పూర్తిగా నిండిపోయి ఉన్నాయి. ఫలితంగా ఈ కాలువల గుండా నీరు ప్రవహించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో మురుగునీరు సైతం కాలువ గుండా పారక ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోవూరుకు సంబంధించి దుంపల కాలువకు చీలికాలువ ఇటీవల కాలంలో పూర్తిగా ఆక్రమణలకు గురి కావడంతో ఆ కాలువ అంతా చెత్తాచెదారాలతో డంపింగ్ యార్డ్‌గా నిండిపోయింది. దీంతో ఈ చీలి కాలువ ద్వారా నీరు ప్రవహించలేక ఎక్కడి నీరు అక్కడ ఆగిపోయి దుర్వా సన వెదజల్లుతోంది. ప్రస్తుతం అంటురోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ కాలువకు పూడిక తీసి మరమ్మతులు చేసేలా సంబంధిత అది .కారులు చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతు న్నారు. ప్రస్తుతం ఈ కాలువ చెత్తా చెదారాలు వేసే డంపింగ్ యార్డ్‌గా పూర్తిగా మారిపోయింది. దీంతో ఈ రహదారి గుండా ప్రయాణించాలంటే నడక దారిన వెళ్లేవారు ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంలో సంబంధిత ఇరిగేషన్ అధికారులు కానీ, పంచాయతీ అధికారులు గానీ స్పందించి ఈ మురుగు నీరు కాలువ గుండా ప్రవ హించేలా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

## వెంగమాంబ బ్రహ్మోత్సవాల్లో దేశం నేతలు



**వింజమూరు, జూన్ 27, ప్రభాతవార్త** దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ వెంగమాంబ బ్రహ్మోత్సవాల్లో వింజమూరు మండల టీడీపీ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, చల్లా శ్రీనివాసులు, చల్లా మాల్యాద్రి, ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ మహబూబ్ భాషా పాల్గొని అమ్మవారి కళ్యాణోత్సవాన్ని కనులార తిలకించారు. కళ్యాణోత్సవం సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు.

# జూలై 1 నుంచి పింఛన్ రూ. 7 వేలు



**నెల్లూరు, జూన్ 27, ప్రభాతవార్త – వైద్యం :** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రజాప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కార్యాచరణ మొదలుపెట్టిందని, ఇందులో భాగంగా జూలై నెల 1వతేది నుంచి రూ.1000 పెంచి రూ. 4000 ఎన్టీఆర్ భరోసా పింఛను మొత్తం అందించేందుకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం నగరంలోని సంతపేటలో గల క్యాంపు కార్యాలయంలో మంత్రి పాత్రికేయుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో గతంలో ఇస్తున్న 3 వేల ఫించన్‌కు రూ. 1000 పెంచి జూలై ఒకటవ తేది నుంచి రూ. 4 వేలు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీకి అధికారులు సమాయత్తమవుతున్నారని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్ మొత్తం ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయిలతో కలిపి జూలై 1న రూ. 7 వేలు పింఛన్ అందించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 65 లక్షల మంది లబ్ధిదారులకు గత ప్రభుత్వం రూ. 2700 కోట్లు ఖర్చు చేయగా, తమ ప్రభుత్వం ఈ నెలలో రూ. 4400 కోట్లు రెట్టింపు మొత్తాన్ని పింఛన్లకు మంజూరు చేసిందన్నారు. పింఛన్ల పంపిణీకి వాలంటీర్లను వినియోగించడం లేదని, గ్రామ, వార్డు, సచివాలయాల ఉద్యోగుల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీకి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అధికారం చేపట్టిన మొదటి నెలలోనే ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీ పింఛన్ల పెంపు నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదేన్నారు. జిల్లాలో 319961 మంది లబ్ధిదారులకు రూ. 218.87 కోట్లు మంజూరు చేసిన్నట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లుగీత, మత్స్యకార, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు తదితర పింఛన్ల మొత్తాన్ని రూ. 3 వేల నుంచి రూ.4 వేల రూపాయిలకు పెంచుతున్నట్లు చెప్పారు. దివ్యాంగులు, క్షయవ్యాధిగ్రస్తులకు ఇస్తున్న పింఛన్ రూ. 3 వేల నుంచి రూ. 6 వేల రూపాయిలు పెంచడం జరిగిందన్నారు. అదే విధంగా పూర్తి అంగవైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులకు ఇస్తున్న రూ. 5 వేల పింఛన్‌ను రూ. 15 వేల రూపాయలకు పెంచినట్లు చెప్పారు. కిడ్నీ, లివర్, బైలేట్రల్ ఎలిఫెంటాసిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇస్తున్న ఫించన్‌ను రూ. 5 వేల నుంచి రూ. 10 వేల రూపాయిలకు పెంచినట్లు చెప్పారు. ప్రజలకిచ్చిన హామీల అమలుకు కార్యాచరణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలైన మెగా డిఎస్సి, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ, తొలి విడతలో 183 అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యాచరణ ప్రారంభించినట్లు మంత్రి చెప్పారు. మెగా డిఎస్సి 2024 ద్వారా భర్తీ చేయనున్న 16 వేల 347 ఉపాధ్యాయ పోస్టుల నియామకానికి మంత్రి మండలి ఆమోదం తెలిపిందన్నారు. ఎస్జీటీలు 6371, పీఈటీలు 132, స్కూల్ అసిస్టెంట్లు 7725, టీజీటీలు 1781, పీజీటీలు 286, ప్రిన్సిపాల్లు 52 పోస్టులను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ప్రశ్నాపత్రం తయారీ నుంచి ఫలితాల వరకు అత్యంత పారదర్శకంగా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన రోజే తన తొలి సంతకాన్ని మెగా డీఎస్సీ పై చేయడం, తదనంతరం మంత్రి మండలిలో ఆమోదింపచేయడం మా ప్రభుత్వం చిత్తశుద్ధికి తార్కాణమన్నారు. ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం 2022 (యాక్టు సంఖ్య 27 ఆఫ్ 2023) రద్దుకు తమ ప్రభుత్వం అమలుచేయ తలపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రజలను భయాందోళనకు గురిచేసిన విషయం తెలిసిందేనన్నారు. గత ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చే క్రమంలో ఎవరినీ సంప్రదించకుండా ఏకపక్షంగా తీసుకొచ్చినట్లు గుర్తించామని, కొన్ని వివాదాస్పద నిర్ణయాల వల్ల ఈ చట్టాన్ని రద్దు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం రాష్ట్రంలో 310 ఇంజినీరింగ్ కాలేజీలు, 1400 డిగ్రీ కాలేజీలు, 267 పాలిటెక్నిక్ కాలేజీలు, 516 ఐటిఐ కాలేజీల నుండి దాదాపు 44 లక్షల యువత ఆయా కోర్సులను పూర్తి చేసుకొని బయటకు వస్తున్నారని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడమే ప్రభుత్వ సంకల్పంగా ఆంధ్రప్రదేశ్ నైపుణ్య సెన్సస్ – 2024 నిర్వహణకు తొలి మంత్రి మండలిలోనే ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్రంలోని పేదవారి ఆకలి దప్పులను తీర్చే లక్ష్యంతో సబ్సిడీ ధరకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 203 అన్నా క్యాంటీన్‌లను పున: ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నామని, తొలి దశలో 183 అన్నా క్యాంటీన్లను ఒకే సారి ప్రారంభించాలని నిర్ణయించినట్లు చెప్పారు. మిగిలిన 20 క్యాంటీన్లను కూడా తదుపరి దశలో ప్రారంభించనున్నట్లు మంత్రి చెప్పారు. విజయవాడలోని డా. వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరును డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంగా పున: నామకరణం చేసినట్లు మంత్రి చెప్పారు.

తిరుమల నుంచే రాష్ట్రంలోని ఆలయాల ప్రక్షాళనకు శ్రీకారం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల ఆలయం నుంచే రాష్ట్రంలోని ఆలయాల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి చెప్పారు. పీఠాధిపతులు, అర్చకులు, పెద్దల సహకారం, ఆలోచనలతో ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణానికి దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 27 వేల ఆలయాలు ఉండగా, శ్రీకాళహస్తి, కాణిపాకం, విజయవాడ, సింహాచలం, అన్నవరం, అరసవెల్లి, ఒంటిమిట్ట ఆలయాలు అత్యంత ప్రసిద్ధి చెందినవి మంత్రి చెప్పారు. ఈ ఆలయాల్లో అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. దేవాలయాల్లో ధూప దీప నైవేద్యాల ఖర్చుల నిమిత్తం గతంలో ఇస్తున్న రూ.5000ను, రూ. 10 వేలకు పెంచేలా ప్రతిపాదనలను సిఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. జగన్ ప్రతిపక్ష హోదా అడగడంలో ఒక అంతర్యం దాగి ఉందని రాష్ట్ర వ్యాప్తంగా ఆయన వైసిపి కార్యాలయాల పేరుతో ప్యాలెస్‌లను కోట్లాది రూపాయిల ప్రజాధనంతో నిర్మించుకోవడమే అందులో ఆంతర్యం అన్నారు. ప్రతిపక్ష హోదా కావాలంటే కనీసం ఒక సిఎంగా పనిచేసిన వ్యక్తికి 18 సీట్లు ఉండాలని తెలియదా అని ప్రశ్నించారు. గతంలో టిడిపికి 21 సీట్లు ఉన్న ప్రతిపక్ష హోదాలో టిడిపి కొనసాగిన శాసనసభ నిబంధనల ఉల్లంఘిస్తూ జగన్మోహన్ రెడ్డి స్పీకర్‌ను కూడా భయపెట్టి ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరించారని రామనారాయణ రెడ్డి ఆరోపించారు. కార్యాలయాలు నిర్మించుకోవాలంటే తన పార్టీ సొంత నిధులతో భూములను కొనుగోలు చేసి నిర్మించుకోవాలి తప్ప కోట్లాది రూపాయల ప్రజాధనాలతో ఇలా ప్యాలెస్‌లను నిర్మించడం సరికాదన్నారు. జగన్‌కి ప్యాలెస్లు నిర్మించుకోవాలని పిచ్చి చాలా ఎక్కువ ఉందన్నారు. అలాగే టిడిపి ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం అతి త్వరలోనే అన్న క్యాంటీన్‌లో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. యువతకు ఎన్నికల్లో చెప్పిన ప్రకారం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి పదవి బాధ్యతలు చేపట్టిన రోజే మెగా డిఎస్సి పై సంతకం చేసి మాట నిలబెట్టుకున్నాడన్నారు. దాంతో పాటు ప్రజా వ్యతిరేకమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ని కూడా రద్దుచేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో బొల్లినేని గిరినాయుడు, కాటం రెడ్డి రవీంద్ర రెడ్డి, ఆనం రంగమయూర్ రెడ్డి పాల్గొన్నారు.

## బెటర్‌మెంట్ పరీక్షా ఫలితాలలో శ్రీ వశిష్ట హవా

**కావలి రూరల్, జూన్ 27 ప్రభాతవార్త** జూనియర్ ఇంటర్ బెటర్‌మెంట్ పరీక్షా ఫలితాలలో కావలి పుల్లారెడ్డినగర్‌లోని శ్రీ వశిష్ట జూనియర్ కళాశాల విద్యార్థులు హవా కొనసాగించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో వి.శ్రీపూజిత 467/470 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్, యం.చంద్రప్రియ, కె.లక్ష్మి హరిత 466/470 మార్కులు సాధించి స్టేట్ సెకండ్, ఎన్.వి.సంజన, వి.వి.సాయి హన్షి, బి.హన్షిక, పి.సౌజన్యలు 465/470 మార్కులు సాధించి స్టేట్ థర్డ్‌లో నిలిచారు. 460 మార్కులు పైన 12 మంది విద్యార్థిని, విద్యార్థులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ కోట సురేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ మహ్మద్ అల్తాఫ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. అనంతరం డైరెక్టర్ కోట సురేంద్రరెడ్డి మాట్లాడుతూ కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరం నుండి కావలి పట్టణంలో సంచలన ఫలితాలు సాధిస్తూ క్రమం తప్పకుండా వరుసగా మూడు సంవత్సరాలు హ్యాట్రిక్ విజయాలను సాధిస్తూ కావలి పట్టణ, పరిసర ప్రాంత ప్రజల, విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలు పొందామన్నారు. రానున్న రోజులలో కూడా మరెన్నో విజయాలను శ్రీ వశిష్ట జూనియర్ కళాశాల సొంతం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

**నెల్లూరు క్రైం, జూన్ 27, ప్రభాతవార్త** ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో మధ్య వయసుకుడైన వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం నెల్లూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే నగరంలోని బీవీ నగర్ రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని తీవ్ర గాయాలు పాలై ఒక వ్యక్తి మృతి చెందారు. మృతుని వయసు సుమారు 45 ఏళ్ల వరకు ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. పసుపు చొక్కా ఆకుపచ్చ అంచు లుంగీ ధరించి ఉన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న నెల్లూరు రైల్వే ఎస్ఐ మాలకొండయ్య మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## ఆడమగ శిశువుల మధ్య వివక్షతను విడనాడాలి




కావలి, జూన్ 27 ప్రభాతవార్త సమాజంలో ఆడమగ శిశువుల మధ్య వివక్షతను విడనాడి లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ డిప్యూటీ డియంఅండ్‌హెచ్‌వో డాక్టర్ బ్రిజిత తెలిపారు. గురువారం కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాల సమావేశ మందిరంలో లింగ నిర్ధారణ నిషేధిత చట్టం సలహా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడారు. భ్రూణ హత్యల్ని నివారించి ఈ చట్టం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. వైద్యశాలలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమన్నారు. ఆడ, మగ శిశువుల మధ్య వివక్ష లేకుండా బిడ్డలను పెంచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, రీజనల్ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం సలహా కమిటీ సభ్యులు యం.మాలకొండారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్రాంత తెలుగు పండిట్ వనజా మృతి



**కావలి, జూన్ 27 ప్రభాతవార్త** కావలి విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాల పూర్వపు హెడ్మాస్టర్ ఎన్.ఆర్.కుమారస్వామి సతీమణి విశ్వోదయ బాలికల ఉన్నత పాఠశాల విశ్రాంత తెలుగు పండిట్ వనజా మృతి చెందారు. ఆమె అంతిమ సంస్కారాలను కుమారులు శ్రీనివాస్, నరేంద్ర, రంగనాథంలు కావలిలోని వారి స్వగృహంలో గురువారం నిర్వహించారు. విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాల విశ్రాంత హెచ్‌యం సి.శారద, పలువురు ఉపాధ్యాయులు వనజా మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## మంత్రి ఆనంను కలిసి సంగం మండలం నాయకులు



**సంగం జూన్ 27 ప్రభాతవార్త** దేవాదాయశాకమంత్రి ఆనం రామనారాయణరెడ్డిని సంగం మండలం నేతలు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, చెర్లో వంగల్లు నాయకులు పగడాల రఘురామయ్య, అన్నారెడ్డిపాళెం నాయకులు బండా హరికిషోర్‌రెడ్డి, పూసాల శ్రీదర్, నాగిశెట్టి శ్రీనివాసులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా గ్రామాలకు సంబందించి కొన్ని సమస్యలు ఆయన దృష్టికి తీసుకొని వెళ్లారు.

## శ్రీ షిరిడీ సాయికు వైభవంగా అభిషేక పూజలు



**కోవూరు, జూన్ 27 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న శ్రీ షిరిడీ సాయి మందిరంలో గురువారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా మాక్కిలింపేట గ్రామానికి చెందిన కె. వేణుగోపాల్‌రెడ్డి, భార్గవి దంపతులు వ్యవహరించారు.

## మంత్రి ఆనం ను సత్కరించిన జనసేన నేతలు



**నెల్లూరు, జూన్27 ప్రభాతవార్త-విద్య** రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని గురువారం నగరంలోని స్థానిక సంతపేటలోని మంత్రి నివాసంలో జనసేన నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా జనసేన నేత నూనె మల్లిఖార్జున యాదవ్ మాట్లాడుతు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి సేవలను జిల్లాకు ఎంతో అవసరమన్నారు. రాష్ట్రంతోపాటూ జిల్లాపై కూడా ఆనంకు పూర్తిస్థాయి అవగాహన ఉందన్నారు. గతంలో ఆనం మంత్రిగా ఉన్న సమయంలో జిల్లా ఎంతగానో అబివృద్ధి చెందిందని గుర్తుచేశారు. తమ పార్టీ జాతీయ మీడియా ప్రతినిది వేములపాటి అజయ్‌కుమార్ సూచనలతో నేడు మర్యాదపూర్వకంగా ఆనం కు కలిశామన్నారు. అలాగే జిల్లాలోని దేవాలయాల్లోఉన్న సమస్యలను ఆయన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గునుకుల కిషోర్, ఏటూరి రవికుమార్, కారంపూడి కృష్ణారెడ్డి, నాగరత్నమ్మ, చరణ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఆనంను కలిసిన జగదీష్



**సంగం జూన్ 27 ప్రభాతవార్త** దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని తెలుగుదేశం నాయకులు, రియల్‌ఎస్టేట్ వ్యా పారి మారంపూడి జగదీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా మంత్రికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో ఎంకె లేవుట్‌లో జరిగిన సభను గురించి మంత్రికి గుర్తు చేశారు. మంత్రికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

# పెండింగ్ కేసులపై దృష్టి పెట్టండి

### జిల్లా పోలీసు అధికారులకు ఎస్పి ఆదేశం






**నెల్లూరు క్రైం, జూన్ 27, ప్రభాతవార్త** దర్యాప్తు పెడింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, పారదర్శకంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పి ఆరిఫ్ హాఫీజ్ జిల్లా పోలీసు అధికారులను సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక ఉమేష్ చంద్ర సమావేశ మందిరంలో ఆయన నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ కేసులను ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వెంటనే చేధించాలని ఆదేశాలు జారి చేశారు. మహిళలు, బాలికలు, వృద్ధులు తప్పిపోయిన కేసులలో వెంటనే ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాలని, ట్రేసింగ్‌లో ఏహెచ్‌టియుతో సమన్వయం చేసుకుంటూ సిపిఎస్, సైబర్, ఐటీ కోర్ సిబ్బంది సహకారంతో అందుబాటులో ఉన్న పలు సాంకేతికత పరిజ్ఞానం ఆధారంగా శోధించాలని సూచించారు. హత్య, పోక్సో కేసులలోని ముద్దాయిలపై తప్పక షీట్స్ ఓపెన్ చేయాలని ఆదేశించారు. జూన్ 29న జరగనున్న నేషనల్ లోక్ అధాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలని ఎస్పి సూచించారు. లోక్ అధాలత్ ద్వారా సత్వర, శాశ్వత, ఆమోదయోగ్యమైన పరిష్కారం లభిస్తుందన్నారు. భారత ప్రభుత్వం ప్రస్తుత సమాజానికి అనుగుణంగా మార్పులు చేసి వాటి స్థానాలలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం అను నూతన చట్టాలలో మార్పులు, చేర్పులను కుణ్ణంగా వివరించి, సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా చేధించి, రికవరీ శాతాన్ని పెంచాలని చెప్పారు. పగటి పూట, రాత్రి వేళ గస్తీలను పటిష్టంగా అమలుపరచాలని, వాహనాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహించి అనుమానిత వ్యక్తులపై దృష్టి సారించాలని ఆదేశించారు. రౌడీ షీటర్ల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే, స్టేట్ హైవే లందు హైవే మొబైల్స్ ద్వారా ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంతో పాటు, బ్లాక్ స్పాట్ల వద్ద అవసరమైన వార్నింగ్ సిగ్నల్ లైట్లు, సూచిక బోర్డులను, స్టాపర్లను ఏర్పాటు చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల పై ఉక్కు పాదం మోపాలి. చైన్ స్నాచింగ్స్ జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, హత్య కేసులు, డెకాయిటి, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, మిస్సింగ్, చీటింగ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, డిపిఓకు సంబంధించి పెండింగ్ రిప్లై ఫైల్స్, పెండింగ్ ఎన్‌బిడబ్ల్యు, ఎన్‌డిపిఎస్ కేసులలో దర్యాప్తు, రికవరీల గురించి సర్కిల్ వారీగా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పితో పాటు అడిషనల్ ఎస్పి (అడ్మిన్) సిహెచ్ సౌజన్య ఇతర జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ-2024 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ



**నెల్లూరు టౌన్, జూన్ 27, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న మెగా డీఎస్సీ పోటీ పరీక్ష లకు నెల్లూరులోని బీసీ స్టడీ సర్కిల్లో అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ జూలై 1వ తేదీ నుండి ప్రారంభమవుతుందని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి వై.వెంకటయ్య తెలి పారు. గురువారం సాయంత్రం జిల్లా కేంద్రమైన నెల్లూరులోని డీబీసీడబ్ల్యూఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుండి ఆగష్టు 30వ తేదీ వరకు రెండు నెలల పాటు అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని శిక్షణ కాలంలో అభ్యర్థులకు స్టైఫండ్ కింద రూ. 1500లు, స్టడీ మెటీరియల్ కింద మరో వెయ్యి రూపాయలు అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు. బీసీ స్టడీ సర్కిల్లో గ్రంధాలయ వసతి కూడా ఉందని ఈ గ్రంధాలయాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొత్తం గరిష్టంగా 200 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఒక్కొక్క బ్యాచ్‌కు 100 మంది అభ్యర్థులు చొప్పున, రెండు బ్యాచ్‌లకు విడివిడిగా డీఎస్సీ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే అనుభవం కలిగిన సబ్జెక్టుల వారీగా గరిష్టంగా ఐదు మంది ఫ్యాకల్టీలు అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. బీసీ అభ్యర్థులకు 66శాతం, ఎస్సీ అభ్యర్థులకు 20 శాతం, ఎస్టీ అభ్యర్థులకు 14 శాతం సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు పదో తరగతి ,ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత ధృవీకరణ పత్రాలు, టెట్ అర్హత పొందిన ధృవీ కరణ పత్రం, బ్యాంకు ఖాతా జిరాక్స్ ఆధార్ కార్డు తదితర ధృవీకరణ పత్రాలతో పాటు రెండు పాస్ ఫోర్ట్‌సైజ్ ఫొటోలు పూర్తి చేసిన దరఖాస్తుకు జత చేసి ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా దర ఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. ఒక్కొక్క క్లాస్ 90 నిమిషాలు ఉంటుందని, ఈ క్లాస్ బోధనకు ఫ్యాకల్టీకి 600 రూపాయలు ఇవ్వడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీలు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. అర్హులైన అభ్యర్థులు, ఫ్యాకల్టీలు పూర్తి చేసిన దరఖాస్తులను బీసీ స్టడీ సర్కిల్, బిహైండ్ ఆర్టీసీ బస్టాండ్, ఓల్డ్ మీ సేవ సెంటర్, శోధన నగర్ అనే చిరునామాకు నేరుగా గాని పోస్టు ద్వారా గాని ఈనెల 30వ తేదీ సాయంత్రం 5గంటల లోగా అందజేయాలని ఆయన సూచించారు.

## విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహకాల పంపిణీ



**నెల్లూరు, జూన్27 ప్రభాతవార్త-విద్య** స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని స్థానిక 28వ డివిజన్ పరిధిలోని పొదలకూరురోడ్డు జిల్లా పరిషత్ ఉన్నత పాటశాలలో విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సా హకాల పంపిణీ ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొని ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాలడుతు విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. నెల్లూరు రూరల్ పరిధిలోని పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు తమ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అహర్నిశలు పాటు పడుతున్నారని తెలిపారు. రెండవ సారి ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం అనేక కార్యక్రమాలు ఇదే పాఠశాలలో ప్రారంభించటం జరిగిందని గుర్తుచేశారు. ఈ పాఠశాలలో చదివి వివిధ స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు 2007 నుండి స్పందన పౌండేషన్ పేరుతో కార్యక్రమాలు చేస్తే విద్యార్ధులను ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. 23మంది విద్యార్థులకు ప్రోత్సాహకాల కింద రూ. 5వేలు చొప్పున్న అందించటం స్ఫూర్తి దాయకమన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి కార్య క్రమాలు మరిన్ని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, ఎస్ఎస్ఏ పిఓ ఉషారాణి, స్థానిక కార్పోరేటర్ చెక్క అహల్య, తెలుగుదేశం పార్టీ నాయకులు చెక్క సాయి సునీల్, రాజా నాయుడు అరవ శీను, దోరబాబు, దామెదర్, సురేష్‌రెడ్డి, ముని శేఖర్, జంగం సుబ్బన్న, కుమార్, పుష్పరాజ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కొలపనాయుడుపల్లిలో మైనింగ్ ఏడి విచారణ



**చేజర్ల జూన్ 27 ప్రభాతవార్త** చేజర్ల మండలం కొలపనాయుడుపల్లి గ్రామంలో పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న మైనింగ్ స్టాక్ పాయింట్‌పై జి ల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడి విచారణ చేపట్టా రు. ఈ సందర్భంగా జిల్లా డిప్యూటి డైరక్టర్ ఆదే శాల మేరకు గురువారం మైనింగ్ ఏడి విచారణ చేపట్టినట్లు తెలియజేశారు. కొలపనాయుడుపల్లి గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్‌గా విధులు నిర్వ హి స్తు తెల్లరాయి స్టాక్‌పాయింట్ అనుమతులు పొం దిన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ మినరల్స్ యాజ మాన్యం వై.సుబ్బరత్నమ్మకు సంబందించిన స్టాకు పాయింట్ వద్ద అధికారులు విచారణ చేసి సర్వేనెంబర్ 523కి సంబందించి రికార్డులు పరిశీలించారు. సుమారు 12 వందల టన్నుల తెల్లరాయి స్టాకు పాయింట్‌లో ఉన్నట్లు గుర్తించడం జరిగింది. ఇందుకు సంబందించి ఎక్కడ కొనుగోలు చేశారో వివరాలు తెలియాల్సి వుందని విచారణలో తెలుస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో మైనింగ్ అధికారులు ఆర్ఐలు, ప్రసాద్, దేవిసింగ్, అధికారులు పాల్గోన్నారు.

## నేటి నుండి మానసాదేవి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు



**వరికుంటపాడు, జూన్ 27, ప్రభాతవార్త :** కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి గా మెట్ట ప్రాంత ప్రజలు ఆరాధ్య దేవతగా విరజిల్లుతున్నటువంటి శ్రీ మానసాదేవి అమ్మవారి బ్రహోత్సవాలు శుక్రవారం నుండి ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని తూర్పు రొంపిదొడ్ల గ్రామంలో వెలిసి ఉన్నటువంటి శ్రీ మానసాదేవి అమ్మవారి పదవ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు చల్లా వంశస్థుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ప్రారంభం కానుండగా గణపతి పూజ, నవగ్రహ మండపారధన సహస్ర దీపాలంకరణ తదితర ప్రత్యేక పూజలు, సాయంత్రం ఐదు గంటలకు శ్రీ లక్ష్మీనారాయణ కళ్యాణము నిర్వహించున్నారు. 29 న శనివారం గణపతి పూజశ్రీ సూక్త సర్వ సూక్త సహిత మానసాదేవి హోమము, చండి హోమము మహానివేదనము వంటి కార్యక్ర మాలు ఉంటాయనీ, చివరి రోజు ఆదివారం వాల్మికి పూజ, కుంకుమ పూజ, పొంగల్లు సమర్పన వంటి కార్యక్రమాలతో ప్రత్యేక పూజలు జరుగుతాయనీ నిర్వహకులు తెలిపారు.

# ఎన్ఎంఎంఎస్ ఫలితాల్లో హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



**వింజమూరు, జూన్ 27, ప్రభాతవార్త** వింజమూరులోని జిల్లా బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్ ఎంఎంఎస్ పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. 2023 విద్యా సంవత్సరంకు డిసెంబర్ నెల లో జరిగిన 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పరీక్షా ఫలితాల్లో స్థానిక జడ్పీ పాఠశాల విద్యార్థులు అత్యధికంగా 19మంది విజేతలయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ మాలకొండయ్య తెలిపారు. అలాగే జిల్లా స్థాయిలో ఎం.వీరేంద్రరెడ్డి విద్యార్థి 141 మార్కులు సాధించారని ఆయన తెలిపారు. సదరు పరీక్షల్లో విజేతలైన విద్యార్థులకు నెలకు వెయ్యి రూపాయిలు చొప్పున నాలుగు సంవత్సరాల పాటు రూ. 48వేలు స్కాలర్‌షిప్ విద్యార్థి యొక్క బ్యాంకు అకౌంట్లో జమ అవుతాయన్నారు. జిల్లా బాలుర ఉన్నత పాఠశాల నుండి ప్రతి సంవత్సరం వివిధ ప్రతిభ పోటీ పరీక్షల్లో విద్యార్థులు పాల్గొని అనేక అవార్డులను సాధించడం జరిగిందన్నారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు ఎంతో బాధ్యతాయుతంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఉపాధ్యాయుల కృషి ఫలితమే తమ పాఠశాలలకు ఇంతటి కీర్తి అన్నారు.

## రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి



**కొడవలలూరు జూన్ 27 ప్రభాతవార్త:** కొడవలూరు మండలం, కొడవలూరు గ్రామంలో గురువారం వ్యవసాయాధికారి లక్ష్మీ భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించరు. ఈ సందర్భంగా అమె రైతుల యొక్క పోలాలలో భూసార పరీక్షలు నిమిత్తం మట్టి నమూనాలను సేకరించడం జరిగింది. ఈ పరీక్షలు ఆధారంగా ఎరువులను వాడుకోవడం వలన భూమి ఆరోగ్యం తెలుసుకోవచ్చునీ తద్వారా రైతు ల పెట్టుబడి ఖర్చు తగ్గిచుకోవచ్చునీ తెలియజేశారు. మండలంలోని రైతులు అందరూ ఈ అవకశానీ సద్విని యోగం చేసుకోవాలనీ సూచించారు. ఎఇవో అనుష్యా, విఎఎ శ్రీశివజ్ఞాన, రైతులు పాల్గోన్నారు.